

సమిష్టి కృషితోనే ఎన్నికలు ప్రశాంతం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమిష్టి కృషి వల్లే జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో సఫలీకతులైన జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి ఎపి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సోమ వారం ప్రత్యేకంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఉద్యోగుల సంఘం పుట్టపర్తి, కదిరి తాలూకా కార్యవర్గ సభ్యులు ముందు ఎస్పీ మాధవ్‌రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో కలిసి శాలువా, పూలబొకేతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా కలెక్టర్, ఎస్పీ పటిష్ట చర్యలు చేపట్టి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పోలీసులు, పాత్రికేయులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అందరూ సహకరించడం వల్లనే జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వి.బి.భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, గోవిందప్ప, మల్లికార్జున, వెంకటేశులు, సహాధ్యక్షులు నాగేంద్ర, పుట్టపర్తి తాలూకా అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.బి.రమణారెడ్డి, సహాధ్యక్షులు ఫకృద్దీన్, మడకశిర, పెనుకొండ తాలూకాల అధ్యక్షులు భూతేగౌడ్, అబ్దుల్ ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి : ఎస్పీ

సమర్థవంతంగా పని చేసి ప్రజల్లో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ మాధవ రెడ్డి సూచించారు. సికె పల్లి, కియా పోలీస్ స్టేషన్లలో ఎఎస్ఐలుగా పనిచేస్తున్న సూర్య నారాయణ, నజీర్‌అహ్మద్‌లకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో వారు సోమవారం ఎస్పీ ఛాంబర్‌లో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని, ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ సూచించారు.



ఎస్పీ మాధవరెడ్డికి పూలబొకే అందజేస్తున్న ఎస్ఐ

ప్రభుత్వ కార్యాలయాలకు చంద్రబాబు ఫొటోలు

రొద్దం : మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సోమవారం ఎపి నూతన ముఖ్యమంత్రిగా ఎ న్నికైన నారా చంద్రబాబునాయుడు ఫొటో లను అందజేశారు. మండలం లోని కంబాలపల్లి గ్రామ సర్పంచి కె.మంజు ఆధ్వర్యంలో తమ అభిమాన నాయకుడైన నారా చంద్రబాబు నాయుడు ఫొటోను కంబాలపల్లి గ్రామ సచివాలయం, ఆర్‌బికె కేంద్రం లో పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, పోలీస్ స్టేషన్లలో సంబంధిత అధికారులకు అందజేశారు. సర్పంచి మంజు వెంట కంబాలపల్లి ఎంపీటీసీ రమేష్, పంచాయతీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐకి చంద్రబాబు ఫొటో అందజేస్తున్న సర్పంచి మంజు

నారా రోహిత్‌ను కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

మడకశిర : రాష్ట్రంలో కూటమి ఘన విజయం సాధించడంతో సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హైదరాబాద్‌లో సినీ నటులు నారా రోహిత్, సప్తగిరి, సంతోష్‌లను కలిసి వారికి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నారా రోహిత్ మిత్రులు నియోజక వర్గంలో విస్తృతంగా ప్రచారం చేసి ఎంఎస్ రాజు విజయానికి కృషి చేసిన విషయం తెలిసిందే.



నారా రోహిత్‌ను కలిసిన ఎమ్మెల్యే రాజు

ఒక్కరికే ఛాన్స్..?!



◆ రేపే మంత్రివర్గం ఏర్పాటు ◆ 'అనంత' జిల్లాలో పయ్యావులకే దక్కేనా..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించిన తెలుగుదేశం ప్రభుత్వం రేపు కొలువుదీరనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు ముమ్మరంగా నడుస్తున్న నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణపైనా సర్వత్రా చర్చ నడుస్తోంది. ఎప్పుడూలేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి 13 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను దక్కించుకోగా, బిజెపి ధర్మవరంలో గెలుపొందింది. దీంతో కూటమి జిల్లాలో క్వీన్ స్వీప్ చేసినట్టయింది. ఇంతమందిలో జిల్లా నుంచి ఎవరికి మంత్రివర్గంలో స్థానం దక్కనుందన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఆశావహులుగా ఉన్న వారు అనేక మందే ఉన్నారు. అనంతపురం జిల్లా వరకు చూస్తే మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఉన్నారు. ఈయనే కాకుండా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, కళ్యాణదుర్గం నుంచి తొలిసారిగా పోటీ చేసి గెలుపొందిన అమిలినేని సురేంద్రబాబుతోపాటు వైసిపిలో మంత్రివర్గంలో ఉండి టిడిపిలోకి వచ్చిన గుమ్మనూరు జయరాం ఉన్నారు. ఇంతమంది ఒక్క అనంతపురం జిల్లా నుంచే మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నిస్తున్నవారిలో ఉన్నారు. అయితే ఈసారి పయ్యావుల కేశవ్‌కు మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశాలు ఎక్కువగానున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఎప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చినా అక్కడ అభ్యర్థి ప్రత్యర్థి పార్టీ నుంచి ఉండేవారు. తొలిసారిగా అధికారపార్టీకి చెందిన అభ్యర్థే గెలుపొందారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పయ్యావుల కేవవ్ పిఎసి ఛైర్మన్‌గానూ ఉన్నారు. ఆయన ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో కీలకంగా వ్యవహరించారు. మంచి వాగ్ధాటి కలిగిన ఆయనకు ఈసారి చోటు దక్కే అవకాశాలు ఎక్కువగానున్నట్టు తెలుస్తోంది.

సత్యసాయి జిల్లా నుంచి కూడా మంత్రి ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. మాజీ మంత్రి పరిటాల సునీత మరోమారు మంత్రివర్గం చోటు కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈమెతోపాటు బిసి కోటాలో పెనుకొండ నుంచి గెలుపొందిన సవితమ్మ మంత్రివర్గం రేసులో ఉన్నారు. ఇక కూటమి భాగస్వామ్యంలో భాగంగా బిజెపికి ఐదు మంత్రివర్గ స్థానాలివ్వాలని నిర్ణయం జరిగినట్టు తెలుస్తోంది. ఈ కోటాలో తనకు అవకాశం దక్కుతుందని ధర్మవరం నుంచి గెలుపొందిన సత్యకుమార్ ఆశలు పెట్టుకున్నారు. సత్యసాయి జిల్లాలో ఎవరికి అవకాశాలు ఉండనున్నయన్నది కొంత అయోమయంగానే ఉంది. ఎందుకంటే అనంతపురం జిల్లాలో కమ్మ సామాజిక వర్గం నుంచి కేవశ్‌కు ఇస్తే సత్యసాయి జిల్లాలో ఏ సామాజిక తరగతికి ప్రాధాన్యతనిస్తారన్నది చర్చ నడుస్తోంది. ఒకే సామాజిక తరగతికి ఇవ్వడం సాధ్యమా అన్నది సందేహంగానే ఉంది. ఒకే జిల్లాలో ఒకరికంటే ఎక్కువ మందికి మంత్రివర్గంలో చోటు సాధ్యపడే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే కూటమిలో భాగంగా అటు బిజెపి, ఇటు జనసేన పార్టీకి తగిన ప్రాధాన్యత కల్పించాల్సి ఉంటుంది. ఈ ప్రాధాన్యతల్లో జిల్లాకు ఒక్కటితోనే సరిపెట్టనున్నారు. ఏది ఏమైనా నేటి సాయంత్రానికి ఎవరికి అవకాశాలుండనున్నాయన్న దానిపై మరింత స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.



పయ్యావుల కేశవ్




కాలవ శ్రీనివాసులు



పరిటాల సునీత



సత్య కుమార్



సవితమ్మ

కార్మిక ఉద్యమ స్ఫూర్తి 'పర్సా సత్యనారాయణ'



'పర్సా' జయంతి ఉత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసింగరావు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన కార్మిక ఉద్యమాలకు స్ఫూర్తినీయుడుగా పర్సా సత్యనారాయణ నిలిచారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామం అతిథి గృహంలో శ్రామిక మహిళ సమైక్య అధ్యక్షురాలు దిల్షాద్ అధ్యక్షతన పర్సా సత్యనారాయణ జయంతి ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఇంతియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ఆంగ్లేయులు పాలిస్తున్న కాలంలోనే పర్సా సింగరేణి గనుల కార్మికులను కాంట్రాక్టు విధానం నుంచి పరిగణించకుండా పర్మనెంట్ చేయాలని ఉద్యమించారన్నారు. ఆయన ఉద్యోగాన్ని కూడా వదిలి కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసిన యోధడన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన జీవితమంతా దాదాపు 72 ఏళ్ల పాటు కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడే క్రమంలో భాగంగా 9 ఏళ్ల జైలు జీవితం గడిపారన్నారు. రాష్ట్రంలో సిఐటియు వ్యవస్థాపకుడిగా జాతీయ ఉపాధ్యక్షుడుగా పనిచేశారన్నారు. సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలు చేశారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. పర్సా లాంటి ఎందరో కార్మిక నేతల త్యాగం ఫలితంగా 44 కార్మిక చట్టాలను సాధించుకున్నట్లు తెలియజేశారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి సర్కారు ఆ హక్కులను హరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. లేబర్ కోడ్‌లను తీసుకురావడానికి పన్నాగం పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్సా ఉద్యమ స్ఫూర్తితో ఆయన ఆశయాలను కొనసాగిస్తూ హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాల కోసమే పర్సా జీవితాంతం పోరాటం చేశారన్నారు. శ్రమ దోపిడీ లేని సమాజం కావాలని, రైతులు ఆత్మహత్యలు చేసుకోని సమాజం కోసం, కార్మికులను గౌరవించే సమాజం కావాలని పరితపించారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు ఏ ప్రభుత్వం అవలంబించినా ఆ ప్రభుత్వాల పతనం కావడం ఖాయమన్నారు. గతంలో చంద్రబాబు, ప్రస్తుతం జగన్ ప్రజల వ్యతిరేకతతోనే గద్దె దిగారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహులు, రమేష్, పెదపల్లి బాబావలి, మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఆశా వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, స్థానిక నాయకులు బ్యాల్ల అంజి, పైపల్లి గంగాధర్, మున్సిపల్ వర్కర్లు రామయ్య, గోవిందు పాల్గొన్నారు.

14న జిల్లాలో రక్తదాన శిబిరాలు

పుట్టపర్తి రూరల్: సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగారావు పిలుపునిచ్చారు. పర్సా సత్యనారాయణ సూచించిన సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరాలను జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలన్నారు. రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు నిలిపే అవకాశం ఉంటుందన్నారు. కార్మికులు, మహిళలు సంవత్సరానికి ఒక్కసారైనా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. 18 నుంచి 60 సంవత్సరాల వరకు ఆరోగ్యం వంతులైన వ్యక్తులు ఎవరైనా దానం చేయచ్చని తెలిపారు. ఈనెల 14న శ్రీ సత్యసాయి జిల్లాలో హిందూపురం లేదా కదిరిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



నీటితో కళకళలాడుతున్న బిటి ప్రాజెక్టు

కర్నాటకలో విస్తారంగా వర్షాలు

బిటి ప్రాజెక్టుకి కొనసాగుతున్న వరద

రాయదుర్గం : నైరుతి రుతుపవనాలు రాయలసీమను తాకాయి. వీటి ప్రభావంతో ఆదివారం నుంచి రాయదుర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక కర్నాటక రాష్ట్రంలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో దిగువనున్న బిటి ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్ట్ ఎత్తు సముద్ర మట్టానికి 1,655 అడుగులు కాగా ఆదివారం 1,644.6 అడుగుల వరకూ నీరు చేరింది. 220 క్యూసెక్కులతో ఇన్ ఫ్లో కొనసాగుతున్నట్లు జల వనరుల శాఖ ఏఈ హరీష్ తెలిపారు.

నారా లోకేష్‌ను కలిసిన నాయకులు

రొద్దం : టిడిపి ప్రముఖ నాయకులు, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను సోమవారం మండల టిడిపి యువనాయకులు కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించిన సందర్భంగా, అలాగే మంగళగిరిలో 40 ఏళ్ల తర్వాత టిడిపి జెండా ఎగరడంతో వారు నారా లోకేష్‌ను గన్నవరం విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నారా లోకేష్‌ను కలిసిన వారిలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరికృష్ణ, ఐటిడిపి మండల అధ్యక్షులు షణ్ముఖ ఉన్నారు.



నారా లోకేష్‌ను కలిసిన రొద్దం నాయకులు

అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళ్తాం

◆ వైసిపి పాలనలో రాష్ట్రం పాతికేళ్లు వెనక్కు
◆ అన్ని విధాలా 'పురం'ను అభివృద్ధి చేస్తా
◆ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ
◆ అభిమానుల నడుమ ఘనంగా జన్మదిన వేడుకలు



అభిమానుల నడుమ 64 కిలోల కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ



అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించి మహిళలకు అన్నం తినిపిస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

ఐదేళ్ల వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెంది ఎంతో నమ్మకంతో కూటమికి అఖండ విజయాన్ని అందించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రంలో పాలన సాగిస్తామని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలియజేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య తన 64వ జన్మదిన వేడుకలను సోమవారం నాడు ఘనంగా జరుపుకున్నారు. హిందూపురంలోని బాలకృష్ణ నివాసం వద్ద అభిమానుల కోలాహలం నడుమ కేక్ కట్ చేశారు. ముందుగా సుగూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద బాలకష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. తన పుట్టిన రోజు సందర్భంగా అన్నా క్యాంటీన్‌ను పున:ప్రారంభించారు. బాలకృష్ణ మహిళలకు అన్నం వడ్డించి వారికి స్వయంగా తినిపించారు. ఎన్టీఆర్ ఆరోగ్య రథంను పున్ణప్రారంభించారు. ఆర్టీసీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. హిందూపురం జెవిఎస్ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. అక్కడ 64 కేజీల కేక్‌ను అభిమానుల మధ్య కట్ చేశారు.

హిందూపురం జెవిఎస్ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. అక్కడ 64 కేజీల కేక్‌ను అభిమానుల మధ్య కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం శాసనసభ్యులుగా మూడవసారి గెలిచి హ్యాట్రిక్ సాధించిన వెంటనే తన జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా అభివద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. గత వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి చెందిందన్నారు. వారి ఐదేళ్ల పాలనకు పాతికేళ్లు వెనక్కి వెళ్లామన్నారు. వైసీపీ చేసిన పాపాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. వైసిపి ప్రభుత్వ నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని, వారి నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయమన్నారు. హిందూపురానికి పరిశ్రమలు, రింగ్ రోడ్డు, హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులకు నీరు, ఎత్తిపోతల పథకం ద్వారా చిలమత్తూరు మండలానికి కష్ణా జలాలను అందించేందుకు కషి చేస్తానన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివద్ధి దిశగా పురోగమిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బాలయ్య ఇంటి వద్ద అభిమానుల కోలాహలం

హిందూపురం ఎమ్మెల్యేగా బాలయ్య హాట్రిక్ విజయం సాధించిన తర్వాత జరుపుకుంటున్న పుట్టిన రోజు వేడుక కావడంతో పెద్ద సంఖ్యలో అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. హిందూపురం నుంచే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానుల నడుమ బాలకృష్ణ కేక్ కట్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డితో పాటు పలువురు అధికారులు బాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్నాక్యాంటీన్, ఎన్టీఆర్ ఆరోగ్య రథం ప్రారంభం

బాలకృష్ణ తన పుట్టిన రోజు సందర్భంగా హిందూపురంలో అన్నా క్యాంటీన్‌ను పున:ప్రారంభించారు. బాలకృష్ణ మహిళలకు అన్నం వడ్డించి వారికి స్వయంగా తినిపించారు. పేదల ఆకలి తీర్చాలని టిడిపి ప్రభుత్వ హయాంలో అన్నా క్యాంటీన్‌లను ప్రారంభించామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక వాటిని మూసివేసి పేదల నోటికాడ అన్నాన్ని లాగేసిందన్నారు. పేదల ఆకలి కష్టం తెలిసిన టిడిపి ప్రభుత్వం రాష్ట్రంలోనే మొట్టమొదటిగా అన్న క్యాంటీన్‌ను హిందూపురంలో ప్రారంభించామన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో బాలకష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అభివద్ధి జరగాలంటే ప్రధానమైనది రవాణారంగం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారిందని విమర్శించారు. గత టిడిపి హాయాంలో ఆర్టీసీ బస్సులు వేస్తే హిందూపురం డిపో నుంచి పది బస్సులు చిత్తూరు జిల్లా పుంగనూరుకు తీసుకెళ్లారంటూ మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం తిలకించేందుకు ప్రత్యేక తెరలు

ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో ఏర్పాట్లు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆ ఘట్టాన్ని ప్రజలు తిలకించేందుకు టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రత్యేకంగా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లను సోమవారం జూనియర్ ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.నరేంద్రచౌదరి ఆధ్వ ర్యంలో తెలుగుతమ్ముళ్లు పరిశీలించారు. ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించడానికి ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారని, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తామని నరేంద్రచౌదరి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు ఫణికుమార్, మద్దిలేటి, చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుస్సేన్, మాధవరెడ్డి, గోసల శ్రీరాములు, చిన్నూరు విజయ్‌చౌదరి, రావులచెరువు కుళ్లాయప్ప, అడ్రా మహేశ్, అమరా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి శ్రేణులు

యథేచ్ఛగా 'ప్రయివేటు' దోపిడీ

విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే మొదలైన దందా
లేనిది ఉన్నట్లు చెబుతూ ప్రకటనలు
ఉన్నది 7 తరగతి వరకు... ప్రకటన 10 వరకు..!
పట్టించుకోని విద్యాశాఖ

ప్రజాశక్తి- చిలమత్తూరు

విద్యాసంవత్సరం ప్రారంభం కాక మునుపే ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీ ప్రారంభమైంది. గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తూ వ్యాపారానికి తెరలేపుతున్నాయి. ఆకర్షణీయమైన బోర్డింగ్‌లు ఏర్పాటు చేసి లేనివి ఉన్నట్లు చెబుతూ పిల్లల తల్లిదండ్రులను మాయచేసి వేలాదిరూపాయలు దండుకుంటున్నాయి. ఇదంతా చూస్తూ విద్యాశాఖ అదికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. చిలమత్తూరు మండల కేంద్రంలో దేవరాయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులను మాయ చేయడంలో అగ్రగామిగా ఉందని చెప్పవచ్చు. అయితే ఆ స్కూల్ కి కేవలం 7 వ తరగతి వరకు అనుమతి ఉండగా 10 వ తరగతి వరకు తమకు అనుమతి ఉందని బోర్డింగ్‌లు ఏర్పాటు చేసి ప్రచారం చేసుకుంటోంది. దీనికి తోడు ఐఐటి పౌండేషన్, ఎపిఆర్ఎస్, నవోదయ శిక్షణ ఉంటుందని ప్రచారం చేస్తోంది. అలాగే కేరళా టీచర్లతో శిక్షణ అంటూ తల్లిదండ్రులను బహిరంగంగానే ఆకర్షిస్తున్న పరిస్థితి నెల్గొంది. ఇది ఇలా ఉండగా ప్రయివేటు పాఠశాలలకు హాస్టల్ వసతి ఏర్పాటు చేసేందుకు అనుమతి ఉండదు కాని విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కి హస్టల్‌ను నిర్వహిస్తున్నారు. అలాగే బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నా కట్టడి చేయల్సిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తుంది. విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంతో ప్రయివేటు స్కూళ్ల దోపిదీకి విద్యాశాఖ అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇది ఇలా ఉండగా నోట్‌బుక్‌ల నుండి పాఠ్యాంశ పుస్తకాల దాక అన్ని తమ వద్దే కొనాలని చెప్పినట్లు తెలుస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం సరఫరా చేసే పుస్తకాలు కాకుండా ప్రయివేటు సంస్థలు ఎలాంటి ప్రమాణాలు లేని పుస్తకాలను నిల్వ ఉంచినట్లు తెలుస్తుంది. ఇప్పటికైన విద్యాశాఖ అదికారులు స్పందించి ఇలాంటి ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకొని విద్యార్థుల తల్లిదండ్రులు దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్యానర్

ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

7 వ తరగతి వరకు ఉన్నా పదోతరగతి వరకు అనుమతి ఉందని చెబుతూ హాస్టల్ నిర్వహణ చేస్తూ, నవోదయ ఏపిఆర్ ఎస్ అంటూ తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రయివేటు పాఠశాల దేవరాయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల తల్లిదండ్రులు ఇలాంటి ప్రయివేటు పాఠశాలల మాటలు నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే దిశగా విద్యాశాఖ చొరవ చూపాలి.

చంద్రశేఖర్ రెడ్డి,
ఎఐఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి

నీటి గుంతలో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద ఉన్న ఓ నీటి గుంతలో ప్రమాదవశాత్తూ పడి సంతోష్‌బాబు(17) మృతిచెందాడు. కియా పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. పెనుకొండ పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త మల్లికార్జున కుమారుడు సంతోష్‌బాబు మిత్రులతో కలిసి గొల్లపల్లి రిజర్వాయర్‌కు వెళ్లారు. సంతోష్‌బాబు రిజర్వాయర్ వద్ద ప్రమాదవశాత్తూ ఓ నీటి గుంతలో పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు కియా ఎస్ఐ రంగడు తెలిపారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరాములు, సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం, బాబిరెడ్డి, సోము, సాయి రమేష్, గోపాల్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు. విషయం తెలిసిన వెంటనే హిందూపురం ఎంపి బికె.పార్థసారథి అల్లుడు శశిభూషణ్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి సంతోష్‌బాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే టిడిపి కార్యకర్త మల్లికార్జున కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టిడిపి పట్టణ కన్వీనర్ రవిశంకర్, శివ, నాని, శీన, తదితరులు ఉన్నారు.

ఎస్పీ, సిఐ నిర్లక్ష్యంతోనే సంపత్‌కుమార్ హత్య
మాజీ ఎంపీ హర్షకుమార్

ప్రజాశక్తి హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, స్థానిక సిఐ శ్రీనివాసుల నిర్లక్ష్యం కారణంగా హిందూపురం పట్టణానికి చెందిన ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ దారుణ హత్యకు గురయ్యాడని అమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్ ఆరోపించారు. గత నెల 30వ తేదీన హిందూపురం పట్టణానికి చెందిన ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ హత్యకు గురైన సంఘటనను తెలుసుకున్న మాజీ ఎంపీ హర్ష కుమార్ సోమవారం సాయంత్రం హిందూపురం పట్టణంలో సంపత్‌కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. సంపత్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలుత స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు పురోగతిపై పోలీసులతో ఆరా తీశారు. అనంతరం సంపత్‌కుమార్ కుటుంబసభ్యులను కలిసి వారిని పరామర్శించారు. సంపత్‌కుమార్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించే విధంగా న్యాయపోరాటం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఓ దళిత యువకుడు ఎదుగుతున్నాడని ఓర్వలేని కొంతమంది కక్ష కట్టి దారుణంగా చంపడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని, తనకు న్యాయం చేయాలని స్థానిక సిఐ తో పాటు జిల్లా ఎస్పీని సంపత్‌కుమార్ విన్నవించినా వారు పట్టించుకోలేదన్నారు. నిందితుడికి పోలీసులు మద్దతుగా నిలిచి ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న హర్షకుమార్

50 శాతం సబ్సిడీతో కంది విత్తనాలను పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ఖరీఫ్ సీజన్లో కంది పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో కంది విత్తనాలను పంపిణీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా చాలామంది రైతులు వేరుశనగ గిట్టుబాటుగాక కంది పంటను సాగు చేస్తున్నారన్నారు. రైతుల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో కందివిత్తనాలు పంపిణీ చేయాలన్నారు.

'కందికుంట'కు యుటిఎఫ్ నాయకుల అభినందన

ప్రజాశక్తి -కదిరి టౌన్

స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు యుటిఎఫ్ స్థానిక నాయకులు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి వైవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కదిరి డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన యుటిఎఫ్ నాయకులు సోమవారం కందికుంటను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, 117 జీవోను రద్దుకు ఒత్తిడి తేవాలని వారు ఈసందర్భంగా కందికుంటను కోరారు. ఈ కార్యక్రమంలో సునీల్ కుమార్, మల్లికార్జున, ఆజంబాషా, మైనుద్దీన్, మధుసూదన్ భార్గవ, మహబూబ్ బాషా, కాజా మొయినుద్దీన్, మనోహర్, నాగరాజు, రాంప్రసాద్ నాయక్, రామసుబ్బయ్య, రమణారెడ్డి, బాలాజీ నాయక్, రమేష్ బాబు, కనికరం ప్రసాదు, హనీఫ్, యుగంధర్, రమణ నాయక్ , ఖాదర్ భాషా, జబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.


కందికుంటను సన్మానిస్తున్న నాయకులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి లభిస్తుందనితారక్ చేయూత ట్రస్ట్ అధ్యక్షులు అంకే రామాంజి, ఉపాధ్యక్షులు వెంకి, ప్రధాన కార్యదర్శి తుకారాం అన్నారు. ఈ సందర్భంగా వారు సోమవారం పట్టణంలోని గీతా నగర్ లో ఒంటరిగా ఉన్న 60 సంవత్సరాలు వయసుగల నారాయణమ్మకు ఒక నెలకు సరిపడు నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేణు, గురు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - తలుపుల

ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్‌లో భాగంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హై రిస్క్ గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అఫ్తాఫ్, డాక్టర్ అశ్రిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

29న జాతీయ మెగా లోక్‌అదాలత్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

స్థానిక కోర్టులో ఈనెల 29న శనివారం జాతీయ మెగాలోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులు, బ్యాంకు రుణం పెండింగ్‌లో ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని జడ్జి సూచించారు.

భృగుతీర్థం సమీపాన అపరిశుభ్రత

కదిరి అర్బన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసర ప్రాంతాలలోనే చెత్త పేరుకుపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి భృగు తీర్థం సమీపాన పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


పేరుకుపోయిన చెత్త

ప్రశాంత ఎన్నికల నిర్వహణ అభినందనీయం


డిఆర్ఒ కొండయ్యను సన్మానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంలో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి ఇతర ఉన్నతాధికారుల కృషి అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అందుబాటులో లేనందున డిఆర్ఒ కొండయ్యను కలసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలోని అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు, పాత్రికేయుల సమిష్టి కృషితోనే ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. అలాగే జిల్లా ఎస్పీని కలిసిన నాయకులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బివి. భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాయకులు రమేష్ రెడ్డి, గోవిందప్ప, లక్ష్మీనారాయణ రెడ్డి, రమణారెడ్డి, బూతేగౌడ్, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న చేనేత సంఘం నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం, కదిరి ఎమ్మెల్యేలు సత్య కుమార్ యాదవ్, కందికుంట వెంకట ప్రసాద్‌కు మంత్రి పదవులు ఇవ్వాలని ధర్మవరం పట్టు చీరల తయారీ వ్యాపారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆసంఘం అధ్యక్షులు గిర్రాజు రవి, కార్యదర్శి హేమంత్ కుమార్, ఉపాధ్యక్షులు పోలా ప్రభాకర్, రంగ మాది నారాయణ, గౌరవ అధ్యక్షులు పోలా వెంకటరమణ, కలవల రాంకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని సెమినారాయణ స్వామి దేవాలయంలో చేనేత వ్యాపారస్తుల అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ధర్మవరం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. దీంతో వ్యాపారులు, చేనేత కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. 56 సంవత్సరాలు తర్వాత బీసీ సామాజికవర్గానికి చెందిన సత్య కుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా గెలుపొందారని అన్నారు. చంద్రబాబు నాయుడు వీరిద్దరికి మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యురాలు జయశ్రీ, నీలూరి శ్రీనివాసులు, నామాల శంకర్, కలవల మురళీధర్, పామిశెట్టి శివశంకర్, గిర్రాజు శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ప్రజా సేవకుడు కందికుంటకు మంత్రి పదవి ఇవ్వాలని బిసి, చేనేత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చేనేత వర్గానికి చెందిన వారందరూ మొదటి నుంచి టిడిపి వెంటే ఉన్నారన్నారు. ఆ వర్గానికి చెందిన వారి సమస్యలు తీరాలంటే చేనేత వర్గానికి చెందిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఆ సంఘం నాయకులు కోరారు.

అంతర్జాతీయ చెస్ టోర్నీ విజేత అఫ్రిద్‌ఖాన్

ప్రజాశక్తి - హిందూపురం

జూన్ 4 నుంచి 9 వరకు భీమవరంలో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ చదరంగం పోటీలలో హిందూపురం స్పార్టన్ చెస్ అకాడమీ క్రీడాకారుడు ఆఫ్రిద్‌ఖాన్ ప్రతిభ కనపర్చి టోర్నమెంట్ విజేతగా నిలిచాడు. నిర్వాహకులు విజేతకు రూ.60 వేలు నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. ఈ పోటీలలో 270 జాతీయ అంతర్జాతీయ చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో పది గేములకు గాను ఆరు గెలిచి నాలుగు గేములు డ్రా చేసుకొని మొత్తం 8 పాయింట్స్ సాధించిన ఆఫ్రిద్‌ఖాన్ మొదటి స్థానం కైవసం చేసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ చెస్ అకాడమి సెక్రటరీ భీమారావు, చీఫ్ ఆర్బిటర్ ఉదయ్ కుమార్ నాయుడు క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో చెస్ లో రాణించిన ఆఫ్రిద్‌ఖాన్‌ను, చెస్ కోచ్ అరిపుల్లా అభినందించారు.


ఆఫ్రిద్‌ఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పుట్టపర్తిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అదే విధంగా ఇదే రోజు సామకోటి జన్మదినం కావడం అతని అభిమానులు టిడిపి నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సామకోటి చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలను నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బేకరీ నాయుడు, బండ్ల సూరి, గూడూరు శంకర్, గణేష్, కేశప్ప, నారాయణప్ప, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం పట్టణంలోని కదిరి ఎమ్మెల్యే కందికుంట నివాసంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను టిడిపి స్థానిక నాయకులు కార్యకర్తలు అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కొత్త చెరువులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాలకృష్ణ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు వంశీ కిషోర్, చికెన్ సెంటర్ వెంకటేష్, సైకిల్‌షాప్ బాబా, సూర్య ప్రకాష్, మీసేవ అభి, మిత్ర, హరి, ఉపేంద్ర, నాని, హర్ష, పెద్దన్న, ఆది తదితరులు పాల్గొన్నారు.


పుట్టపర్తిలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

ధర్మవరం టౌన్ : హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా 36వ వార్డులో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోనుగుంట్ల విజయ్ కుమార్, పరిశేసుధాకర్, ఫణికుమార్, సందా రాఘవ, మద్దిలేటి, మేకలరామాంజినేయులు, చిన్నూరువిజయ్, జింకాపురుషోత్తం, మాధవరెడ్డి, అమరా, సుధాకర్, రాయపాటిశివ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని హిందూపురం పార్లమెంటు కార్యాలయంలో ఎంపీ బికె.పార్థసారథి అల్లుడు శశిభూషణ్ ఆధ్వర్యంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ నిజ జీవితంతో కూడా హీరో అని అభివర్ణించారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఎంతో మంది పేదలకు ఉచిత చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో హిందూపురం ఆసుపత్రిలో సరైన వైద్య పరికరాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో రూ. లక్షలు వెచ్చించి వైద్య పరికరాలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సిద్దయ్య, రవిశంకర్, కేశవయ్య, సుబ్బరాయుడు, పాలడుగు చంద్రశేఖర్, హుజూర్, బోయ గాయత్రి, కేవీపీ ప్రసాద్, పోతిరెడ్డి, బోయ అనిల్ కుమార్, అత్తర్ ఖాదీర్, జావిద్, రియాజ్, హనుమంతనాయక్, వాజిద్, గోనిపేట వెంకటేష్, హరీష్, అంజి, సిద్దప్ప, చంద్ర మౌళి, నాగేంద్ర, రాము, జిరాక్స్ సీనా, కోగిర సూరి, చౌడప్ప, ఆదినారాయణ, నరేష్, సయ్యద్, అబిద్, దాదాబాషా, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

మడకశిర : పట్టణంలోని బాలాజీ నగర్ టిడిపి కార్యాలయంలో సోమవారం నందమూరి అభిమానులు, తెలుగుతమ్ముళ్లు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, నందమూరి అభిమానుల సంఘం గౌరవాధ్యక్షులు జుంజప్ప, అధ్యక్షులు కోట్ల రంగేగౌడ్, పట్టణ కన్వీనర్ మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు భక్తర్‌సాబ్, కౌన్సిలర్లు రాజా. హనుమంతు, శీనప్ప, ఉమాశంకర్, తెలుగు యువత తిమ్మరాజు, బిసి సెల్ కార్యదర్శి శ్రీనివాస్, మంజు తారక్, అశోక్, నాయకులు పాల్గొన్నారు.

లేపాక్షి : లేపాక్షితో పాటు మండలంలోని చోళసముద్రం, బసవన్నవీధిలో ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి పంచి పెట్టారు. జై బాలయ్య అంటూ నినాదాలు చేస్తూ స్వీట్స్ పంచి పెట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు అభిమానులు పాల్గొన్నారు.


కొత్తచెరువులో అన్నదానం చేస్తున్న దృశ్యం

ధర్మవరం టౌన్ : హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణం లోని శివనగర్‌లో గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాలయ్య ప్యాన్స్ అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో చిన్నారి చేత కేక్ కట్ చేయించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలయ్య అభిమానులు పాల్గొన్నారు.


మడకశిరలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


లేపాక్షిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు